జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం | 25 | నవంబర్ | 2025 ♦ పేజీలు : 7



# 15 మంది మావోయిస్టులు లొంగుబాటు

♦ లొంగిపోయిన మావోయిస్టులపై 48 లక్షల రివార్డ్



**చర్ల, నవంబర్ 24 (ప్రజా జ్యోతి ):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్ గఢ్ లోని సుక్మాలో 48 లక్షల రూపాయల రివార్డ్ కలిగి ఉన్న 15 మంది నక్సలైట్లు లొంగిపోయారు. లొంగిపోయిన నక్సలైట్లలో నలుగురుకి ఒక్కొక్కరికి 8 లక్షల రూపాయల రివార్డ్ ని , మరో ఇద్దరు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల రివార్డ్ ని ప్రకటించారు. లొంగిపోయిన వారిలో ఐదుగురు మహిళా నక్సలైట్లు కూడా ఉన్నారు.సుక్మా పోలీస్ సూపరింటెండెంట్ కిరణ్ చవాన్ ముందు లొంగిపోయిన ఐదుగురు మహిళా మావోయిస్టులతో సహా 15 మంది పురుష మావోయిస్టులపై మొత్తం 48లక్షల రివార్డ్ ప్రకటించారు.లొంగిపోయిన మావోయిస్టులలో నలుగురు మావోయిస్టులకు ఒక్కొక్కరికి రూ. 8 లక్షలు, ,ఇద్దరు మావోయిస్టులకు రూ. 5 లక్షలు, ఒక మావోయిస్టుకు రూ. 3 లక్షలు, ఒక మావోయిస్టుకు రూ. 2 లక్షలు, ఒక మావోయిస్టుకు రూ. లక్ష చొప్పున మొత్తం రూ. 48 లక్షల రివార్డు ప్రకటించినట్లు ఎస్పీ తెలిపారు.




## రేపు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు...

# వడ్డీ లేని రుణాలు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 24, ప్రజాజ్యోతి:** ఈనెల 26న బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు కలెక్టర్లను ఆదేశించారు. మొత్తం 3.50 లక్షల మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 304 కోట్ల విలువైన వడ్డీ లేని రుణాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరవుతారని, ముందస్తుగా సమాచారం అందించి సమన్వయాన్ని బలోపేతం చేయాలని చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ కు సూచించారు. ఈ సందర్భంగాడిప్యూటీ సీఎం మాట్లాడుతూ, గత ప్రభుత్వం వడ్డీ లేని రుణాల పథకాన్ని విస్మరించిందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల ఆర్థిక సాధికారత కోసం ఈ పథకాన్ని మరోసారి విస్తృతంగా పునరుద్ధరించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు రెండు–మూడు విడతలుగా రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేసినట్లు తెలిపారు, బుధవారం మరోసారి పెద్ద ఎత్తున ఈ రుణాలను అందించనున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్లు అత్యంత విజయవంతంగా

మిగతా 2 లో...



# ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

### అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**ఇల్లెందు, నవంబర్ 24, ప్రజాజ్యోతి:** ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని, రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని బొజ్జాయి గూడెం, సుదిమళ్ల, బాలాజీ నగర్, సుభాష్ నగర్ గ్రామ పంచాయతీలలో ఐటిడిఏ ద్వారా మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలకు స్వంత ఇల్లు కలను నిజం చేయడం

మిగతా 2 లో...



# మనసును ప్రశాంతత చేకూర్చేందుకే ఓపెన్ జిమ్ లు

♦ భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఎంయల్ఏ తెల్లం



**భద్రాచలం, నవంబర్ 24, ప్రజాజ్యోతి :** ప్రతిరోజు దైనందన కార్యక్రమాలలో భాగంగా ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారస్తులు, ప్రజలు వివిధ పనులు చేసుకుంటూ శారీరకంగా మానసికంగా అలసిపోయి ఉన్న శరీరాన్ని, మనసును ప్రశాంతత చేకూర్చడానికి ఓపెన్ జిమ్ లు ఎంతగానో ఉపయోగపడతాయని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ,ఎంయల్ఏ తెల్లం వెంకట్రావు లు అన్నారు. సోమవారం నాడు ఉదయం భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం ,ఎంపీడీవో ఆఫీస్ వెనుక ఉన్న ప్రకృతి వనంలో ఓపెన్ జీమ్ ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులకు, విద్యార్థులకు, ప్రజలకు, వ్యాపారస్తులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యాయామం చేసుకోవడం వలన శరీరానికి మనసుకు మెదడుకు ప్రశాంతత చేకూర్చడానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రజలు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ మంచి ఆరోగ్యవంతులుగా ఉండాలని వారు సూచించారు. అలాగే ప్రతిరోజు తీసుకునే ఆహార నియమాలలో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపి సమతుల్య ఆహారము తీసుకుంటే ఎటువంటి ఆరోగ్య సమస్యలు అనేవి దరిచేరవని అన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# భూమి గొడవలలో కత్తులతో దాడి

♦ తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులు...మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలింపు

♦ ఒక్కసారిగా గ్రామంలో భయాందోళనలు



**అశ్వారావుపేట, నవంబర్ 24, ప్రజాజ్యోతి :** ప్రశాంతమైన పల్లెల్లో క్షణికావేశంలో కొందరు వ్యక్తులు వ్యవహరిస్తున్న తీరుతో అక్కడి ప్రజల్లో భయాందోళనలు కలుగుతున్నాయి.. భూమి వ్యవహారాలలో ఈ మధ్య వాదోపవాదాలు చిన్నపాటి గొడవలు జరుగుతున్న సంఘటనలు కనిపిస్తున్న సోమవారం మండలంలోని నారంవారిగూడెం కాలనీలో 5 ఎకరాల భూ వ్యవహారంలో కత్తులతో దాడి చేసుకోవడంతో గ్రామంలో ఒక్కసారిగా ప్రజల మధ్య భయాందోళనలు చెలరేగాయి. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం

మిగతా 2 లో...

## ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం





(మొదటి పేజీ తరువాయి...)

ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. మొదటి విడతగా రాష్ట్రంలో నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇండ్లకు రూ. 22,500 కోట్లను కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఇదే తరహాలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు త్వరితగతిన ఇండ్లను పూర్తి చేయాలని సూచించారు. అర్హులకు సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇండ్లు పూర్తయిన లబ్ధిదారులకు విడతలవారీగా బిల్లులను ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ఇల్లందు మాజీ ఎంపిపి చీమల నాగరత్నమ్మను వారి నివాసంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే సుదిమళ్ల గ్రామానికి చెందిన ఊకే స్వామిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపిపి మండల రాము, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి సైదులు, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, సీనియర్ నాయకులు మడుగు సాంబమూర్తి, భోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, మాజీ యంపిపి మోకాళ్ల వెంకటమ్మ, మాజీ సర్పంచులు కల్తీ పద్మ, పాయం స్వాతి, నాయకులు పూనెం సురేందర్, చిట్టిబాబు, దనుంజయ్, రామచంద్రు, వెంకటేశ్వర్లు, అరెం కిరణ్, బానోత్ శారద, ప్రసన్న కుమార్ యాదవ్, నాగార్జున, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూమి గొడవలలో కత్తులతో దాడి

(మొదటి పేజీ తరువాయి...)



నారంవారిగూడెం కాలనీకి చెందిన మంగా వెంకటేశ్వర్లు, మంగా గణేష్ లు పట్టపు శ్రీహరి అనే వ్యక్తి వద్ద 5 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారు. ఆ భూమిలో అరటితోట సాగు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆ భూమి తమది అంటూ అదే గ్రామానికి చెందిన గేదల విష్ణు కుటుంబ సభ్యులు వారి దగ్గర ఉన్న ఆధారాలు చూపించారు. కొద్దిపాటి వాదోపవాదాలు జరిగినట్లు తెలిసింది. 3 నెలల క్రితం గేదెల విష్ణు కుటుంబ సభ్యులు మంగ వెంకటేశ్వర్లు వేసిన అరటి తోటను ధ్వంసం చేశారు. ఈ పరిణామంపై మంగా వెంకటేశ్వర్లు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు కూడా చేసినట్లు సమాచారం . ఇదిలా ఉండగా సోమవారం మంగా వెంకటేశ్వర్లు, గణేష్ పొలం వద్దకు వెళ్ళగా గేదెల విష్ణు కుటుంబ సభ్యుల కూడా అక్కడికి చేరుకున్నారు. వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. క్షణికావేశానికి గురైన గేదల విష్ణు కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు గణేష్ లపై కత్తులు, కర్రలతో దాడి చేయడంతో ఇరువురు తీవ్ర గాయాలతో పొలంలోనే కుప్పకూలిపోయారు. పక్క పొలాలలో పనులు చేసుకుంటున్న స్థానికులు కొందరు గమనించి వెంటనే వారిని అశ్వారావుపేటలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. బాధితులకు తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా మారింది. స్థానిక వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాల్సిందిగా సూచించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాడికి దిగిన గేదెల విష్ణు కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ యాయాతి రాజు తెలిపారు.

# రేపు రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు

(మొదటి పేజీ తరువాయి...)

నిర్వహించారని ప్రశంసిస్తూ, నాణ్యమైన చీరలను అందుకున్న మహిళలు వ్యక్తపరిచిన ఆనందాన్ని గుర్తుచేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి సీతక్క, చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొనగా ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యచందన ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులు మాట్లాడుతూ



ఈనెల 26న అన్ని అసెంబ్లీ నియోజకవర్గకేంద్రాల్లో వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమాలను సమయపాలనతో, ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా సంఘాలకు ఈ రుణాల పంపిణీ కార్యక్రమం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య కార్యక్రమంగా ఉన్నందున అన్ని శాఖల అధికారులు జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, జిల్లాలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని తక్షణం పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి మండలం, ప్రతి గ్రామానికి చీరలు చేరేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితిపై — నిర్మాణంలో ఉన్నవి, పూర్తైనవి, కేటాయించినవి — పూర్తి వివరాలతో నివేదికలను వెంటనే సమర్పించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఈ ఇండ్ల కేటాయింపులు పేదలు, నిజంగా అవసరం ఉన్న నిరుపేద కుటుంబాలకు మాత్రమే అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు, ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్ సహా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇల్లందులో రాజు వెడ్స్ రాంబాయి చిత్ర యూనిట్ సందడి

♦ -చిత్ర యూనిట్ కి ఘన స్వాగతం పలికిన ప్రేక్షకులు





**ఇల్లెందు, నవంబర్ 24, ప్రజాజ్యోతి:** ఇల్లెందులో రాజు వెడ్స్ రాంబాయి చిత్ర యూనిట్ సోమవారం సాయంత్రం సందడి చేసింది. పట్టణంలోని సీతారామ టాకీస్ కు విచ్చేసిన చిత్ర హీరో, హీరోయిన్ దర్శకుడు, నిర్మాత లు తదితర తారా గణం కు ప్రేక్షకులు ఘనంగా స్వాగతం పలికారు. టాకీస్ లో సినిమాను వీక్షించేందుకు వచ్చిన అభిమానులతో చిత్ర యూనిట్ మాట్లాడింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ఇల్లెందు మండలం కొమరారంకు చెందిన కాంపాటి సాయిలు, హీరో అఖిల్ రాజ్, హీరోయిన్ తేజస్వి రావు, గేయ రచయిత మిట్టపల్లి సురేందర్, నిర్మాత లు వేణు ఉడుముల, మరొకరు అభిమానులను ఉద్దేశించి మాట్లాడారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇల్లెందుకు రావడం జరిగిందని, సినిమాకు ప్రజల ఆదరణ ఎంతగానో ఉండటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏజెన్సీ మండలాల గ్రామీణ ప్రాంతాల్లో అధిక భాగం చిత్ర చిత్రీకరణ జరిగిందని పేర్కొన్నారు. మంచి కథ కథనంతో ప్రేక్షకుల ముందుకు రాజు వెడ్స్ రాంబాయి చిత్రాన్ని తీసుకొచ్చామని ప్రజల ఆదరణ ను చిత్రం పొందిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలను తీసుకురానున్నట్లు తెలిపారు. చిన్న చిత్రాలను సైతం ప్రజలు ఆదరిస్తారు అనడానికి మాయి రాజు వెడ్స్ రాంబాయి చిత్ర హిట్తో ప్రేక్షక దేవుళ్ళు నిరూపించారన్నారు. అనంతరం చిత్ర యూనిట్ డిస్ట్రిబ్యూటర్స్ సినిమా థియేటర్ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

## శ్రమయేవ జయతే... జిల్లా సమిష్టి కృషి ఫలితం జాతీయ అవార్డు

♦ కలెక్టర్ జితేష్ వి పాటిల్





**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 24, ప్రజా జ్యోతి** జిల్లా నీటి సంరక్షణలో సాధించిన విశిష్ట విజయాలకు గాను ప్రతిష్ఠాత్మక 'జల్ సంచయ్–జన్ భాగీదారీ' జాతీయస్థాయిలో కేటగిరీ–3లో రాష్ట్రంలో మొదటి స్థానాన్ని సాధించడం ,విశిష్ట ఫలితానికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం రూ.25 లక్షల నగదు బహుమతిని ప్రకటించిన సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి , సెంట్రల్ వాటర్ బోర్డ్ కమిషన్ మెంబర్ పృధ్వీరాజ్ కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి సంరక్షణకు చేపట్టిన ప్రతి కార్యక్రమం అధికారుల నిబద్ధత, గ్రామస్థాయి వర్గాల ప్రాముఖ్యతతో విజయవంతమైందని అన్నారు, శ్రమయేవ జయతే అనే నానుడికి నిజమైన ప్రతీరూపంగా భద్రాద్రి కొత్తగూడెం నిలిచిందని, జిల్లా సాధించిన చిత్రాలు,గణాంకాలు జాతీయ స్థాయి వేదికపై చూసినప్పుడు గర్వ భావన కలుగుతోందని అన్నారు. మొదట తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతలు ఎలా త్రవ్వాలన్న దానిపై పరిశీలన జరిపి ఎంపీడీవోలు ప్రతిపాదించిన మోడల్ ను అమలులోకి తీసుకువచ్చామని, తరువాత ఉపాధి హామీ కూలీలు, పంచాయతీ వర్కర్ల తో ప్రత్యక్షంగా పాల్గొనడంతో త్రవ్వకాలలో ఎదురయ్యే సమస్యలను గుర్తించగలిగామని తెలిపారు. పనికి కావాల్సిన చిన్న పరికరాలు కూడా అందుబాటులో లేకపోవడంతో "పలుగు పార" పరికరాలను జిల్లావ్యాప్తంగా పంపిణీ చేసి కూలీలకు సహాయంగా నిలిచామన్నారు. పంచాయతీ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లతో ప్రారంభమైన ఒక ఉద్యమంలా అన్ని శాఖల సమన్వయంతో జిల్లావ్యాప్తంగా విస్తరించి, జాతీయస్థాయిలో జిల్లాకు ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందించిందని చెప్పారు. అవార్డు సాధించడం ముఖ్య లక్ష్యం కాదని, భూగర్భ జలాల పరిరక్షణ, వ్యవసాయానికి నీటి అందుబాటును పెంచడం, వర్షపు నీరు భూమిలో చేరేలా చేయడం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షల బహుమతిని కూలీలకు త్రవ్వకాల భారాన్ని తగ్గించే యంత్ర పరికరాల కొనుగోళ్లకు వినియోగించాలన్న సూచన చేశారు. అదే విధంగా జిల్లాలో ఇప్పటికే తవ్విన ఇంకుడు గుంతలను శుభ్రపరిచే కార్యక్రమాలు ప్రారంభించాలని, బయోచార్, ఫామ్ పాండ్ల నిర్మాణం ద్వార నేల సారాన్ని కాపాడి భూభాగ సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లావ్యాప్తంగా సూచనలు జారీ చేశారని తెలిపారు. బయో చార్ట్ తయారీ మరియు ఫామ్ పాండ్ తవ్వకం ద్వారా మట్టిని కాపాడాలని దాని ద్వారా రైతులు అభివృద్ధి చెందుతారని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాకు జాతీయస్థాయి గుర్తింపు తీసుకువచ్చిన జిల్లా అధికారులకు,ఎంపీడీవోలు, పంచాయతీ సిబ్బంది, వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ, వైద్యశాఖ, ఇరిగేషన్ ,సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేసి సత్కరించారు. నీటి సంరక్షణ ఉద్యమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దేశానికి ఆదర్శంగా నిలిచిందని, ఈ ఉత్సాహం, ఈ కృషి అదే విధంగా కొనసాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

# మహిళల అభ్యున్నతే ధ్యేయం - ఎమ్మెల్యే కూనంనేని.

- ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్వంచలో పాల్గొన్న ఎమ్మెల్యే.



**పాల్వంచ(టౌన్), నవంబర్ 24,(ప్రజా జ్యోతి ):** రాష్ట్రంలో ప్రతి మహిళకు అండగా నిలవడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ఇందిరా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా సంఘాల ఆడపడుచులకు చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టతరంగా ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను అమలు చేస్తూ మహిళలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. మహిళలు స్వయం శక్తితో ముందుకు రావాలనేది ప్రభుత్వ అభిలాష అని, అందుకు వడ్డీరహిత రుణాలు,డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్టు తెలిపారు. రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు మరింతగా ఎదగాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పాల్వంచ ప్రజలు ఇచ్చిన అత్యధిక మెజారిటీ తనకు ఎంతో గొప్ప బాధ్యతను అప్పగించిందని,ఆ స్నేహాన్ని మరువలేనని ఎమ్మెల్యే భావోద్వేగంతో పేర్కొన్నారు. పాల్వంచను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు సేవ చేయడం ద్వారా ఆ ఋణాన్ని తీర్చుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం,మండల కార్యదర్శి వీ. సంశెట్టి పూర్ణచందర్రావు,జిల్లా నాయకులు ఇట్టి వెంకటరావు, నిమ్మల రాంబాబు, వైయస్ గిరి, కాంగ్రెస్ నాయకులు రాష్ట్ర డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, కొండం వెంకన్న, తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీవో విజయభాస్కర్ రెడ్డి, ఐకెపి ఎపిఎం, భగీరథ ఏఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో మెరుపులు మెరిపించిన మహాత్మ జ్యోతిబా పూలే కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక



**అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 24, (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర డిగ్రీ మరియు జూనియర్ కళాశాల జూనియర్ విభాగానికి చెందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు అర్హత సాధించారు అని కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఎస్ కే బురాన్ తెలిపారు. అండర్–19 విభాగంలో: 1. ఎం. యశ్వంత్ – హ్యాండ్‌బాల్ 2. టీ. సాయిరాం – వాలీబాల్ అండర్–17 విభాగంలో: 3) జె. ప్రజ్ఞాన్, బి. హరీష్ – సాఫ్ట్‌బాల్ 4) ఏ. వీరభద్ర – ఖో–ఖో 5) టీ. విష్ణు – హ్యాండ్‌బాల్ జిలా స్థాయి ఎంపికల్లో మెరిసిన ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పోటీపడేందుకు అర్హత పొందారు. చదువుతో పాటు క్రీడలలోనూ రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని స్పెషల్ ఆఫీసర్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను రాష్ట్రస్థాయికి ప్రోత్సహించిన పీడీ డాక్టర్ రఘువరన్‌ను కూడా అభినందించారు.

# విద్యార్థులకు గంజాయి మత్తు పదార్థులపై అవగాహన






**టేకులపల్లి,నవంబర్ 24, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్రం చేపట్టిన మిషన్ పరివర్తన తెలంగాణ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలని దృక్పథంతో చేపట్టిన టువంటి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల టేకులపల్లి సోమవారం సాయంత్రం మూడు గంటలకు విద్యార్థులకు గంజాయి మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కార్యక్రమా నికి మిషన్ పరివర్తన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బాధ్యులు వి రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ దేశ భవిష్యత్తు దిశా నిర్దేశం చేసే శక్తి నేడు యువతకు ఉందని అటువంటి ఎంతోమంది యువకులు ప్రస్తుత సమాజంలో గంజాయి మత్తు పదార్థాలకు బానిసవుతున్నారని దీనివల్ల రాబోయే భవిష్యత్తు అంధకారంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు కూడా డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థులు చదువుపై ఏకాగ్రత ఉంచి శ్రద్ధగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సమాజంలోని చెడు రుగ్మతలకు దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు డ్రగ్స్ రహిత సమాజం నెలకొల్పుతామని ప్రతిజ్ఞ చేశారు. నషా ముక్త భారత్ అభియాన్ లో భాగంగా విద్యార్థులకు రంగోలి పోస్టర్ డిజైనింగ్ పోటీలను నిర్వహించడం జరిగినది. ఇందులో గెలుపొందిన విజయతలైన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతి ప్రధానము ప్రశంసా పత్రము ఇవ్వడం జరిగినది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సులోచన రాణి, స్టూడెంట్ కౌన్సిలర్ ఎండి. ముంతాజ్ అలీ, అధ్యాపకులు బాబురావు,బసవమ్మ, శంకర్రావు, శ్రీనివాసరావు, వేణుగోపాల్, యాకూబ్,నాగేశ్వరరావు, సంజీవ రెడ్డి,సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# బూర్గంపాడు లో కార్మికుల నిరసనలు

- లేబర్ కోడ్ ల రద్దు కోరుతూ 26న ఆందోళనకు పిలుపు.



**పాల్వంచ టౌన్, నవంబర్ 24(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలో నవంబర్ 26న భారీ నిరసన ఆందోళనకు పిలుపునిచ్చారు.కార్మికులు ఎన్నో సంవత్సరాలుగా పోరాడి సాధించిన కార్మిక చట్టాలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని, హక్కులను ఖాళీ చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం దేశ వ్యాప్తంగా కార్మికుల కోసం ఉన్న 29 కార్మిక హక్కుల చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ కార్మికులకు ఉరితాడు లాంటివి అయ్యాయని తెలిపారు.ఈ నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ,పెద్ద ఎత్తున కార్మిక సంఘాలు నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నాయి. సీఐటియు ఆధ్వర్యంలో ధర్నాలు, దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. బూర్గంపాడు మండల కేంద్రంలో జరగబోయే ఈ నిరసనలో కార్మికులు, వ్యవసాయ కార్మికులు,రైతులు, ఇతర వర్గాలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని బత్తుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ మహిళలకు చీకటి రోజులు తెచ్చినట్టు ఆరోపిస్తూ,కనీస వేతనం ₹26,000 ఇవ్వాలని,కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తున్న ₹176 కనీస వేతనాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కార్మికుల పొట్ట కొడుతున్న దుర్మార్గమైన నిర్ణయాలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చిందని అన్నారు.కార్మికుల హక్కులను కాపాడుకోవాలంటే సమైక్యంగా పోరాడాలని,26న జరగనున్న నిరసనను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# జల శక్తి–జల అభియాన్‌లో ప్రతిభ.

- పాల్వంచ మండల అధికారులకు జిల్లా స్థాయి అవార్డు.




**పాల్వంచ(టౌన్),నవంబర్ 24(ప్రజా జ్యోతి ):** జల శక్తి – జల అభియాన్" పథకంలో జల సంరక్షణ చర్యలను సమర్థంగా అమలు చేసి విశేష ప్రతిభ కనబర్చినందుకు పాల్వంచ మండల అధికారులు జిల్లా స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు.జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్,అదనపు జిల్లా కలెక్టర్ విద్యా చందనా చేతుల మీదుగా ఈ అవార్డులను అధికారులు స్వీకరించారు.అవార్డు అందుకున్న వారు:ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి ఎంపీఓ చెన్నకేశవులు ఏపీవో పోరండ్ల రంగా ఏపిఎం మీరాభి మందరికలపాడు కార్యదర్శి మోసే కంప్యూటర్ ఆపరేటర్ కే. లక్ష్మణ్ రావు జగన్నాధపురం క్షేత్ర సహాయకుడు మాలోత్ శంకర్ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పథకం లక్ష్యాలైన జల సంరక్షణ, వర్షపు నీటి నిల్వ, గ్రామీణ నీటి వనరుల అభివృద్ధి వంటి అంశాల్లో పాల్వంచ మండల బృందం చూపిన కృషి శ్లాఘనీయమని అభినందించారు.

# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య

**టేకులపల్లి, నవంబర్ 24, ప్రజాజ్యోతి :** మండలం బేతంపూడి గ్రామం నందు ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశానికి ముఖ్య అతిధిగా హాజరైన ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్యను వజ్జ హైమావతి,కిరణ్ దంపతుల నూతన ఇంటిని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే కోరం కనకయ్యకు కృతజ్ఞతలు తెలుపుతూ, శాలువాతో సన్మానించారు. అనంతరం తమ ఆహ్వానం మేరకు గృహప్రవేశం కార్యక్రమానికి విచ్చేసిన ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్, మార్కెట్ చైర్మన్ రాంబాబు, సీఐ బత్తుల సత్యనారాయణ , మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, హౌసింగ్ ఏఈ నూనావత్ గణేష్, పంచాయతీ సెక్రటరీ ని శాలువాతో సన్మానించడం జరిగినది.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్, మాజీ సర్పంచ్ బాబు, భూక్యా సర్దార్, విజయ్, సుధీప్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## యస్&పిసి జమేదార్లకు పున:శ్చరణ శిక్షణా తరగతులు ప్రారంభం



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 24 – ప్రజాజ్యోతి:** సింగరేణి వ్యాప్తముగా గల ఎస్&పిసి జమేదార్లకు విడతల వారీగా నిర్వహించే పునశ్చరణ శిక్షణా తరగతులలో భాగముగా సోమవారం నుండి ఈనెల 29వ తేదీ వరకు కొత్తగూడెం ఎస్&పిసి ట్రైనింగ్ సెంటర్ లో నిర్వహించే 14వ బ్యాచ్ జమేదార్ల పున:శ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మేనేజర్ (సెక్యూరిటీ) యం.డి. జాకీర్ హుస్సేన్ హాజరై ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భముగా మేనేజర్ (సెక్యూరిటీ) యం.డి. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ... సెక్యూరిటీ సిబ్బంది అందరికీ క్రమశిక్షణ అనేది ముఖ్యం అని, మనం క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నపుడే మనకు గుర్తింపు వస్తుందని, జమేదార్లు ఫ్రంట్ లైన్ సూపర్ వైజర్గా కీలకపాత్ర పోషిస్తారని, యస్&పిసి ప్రధాన విధులలో సెక్యూరిటీ సిబ్బంది రోజువారీ కార్యకలాపాలను పర్యవేక్షించి, వారిని సమన్వయంతో విధులను సమర్ధవంతంగా నిర్వహించేందుకు మార్గదర్శకత్వం వహించాలని, యస్& పిసి విభాగము పటిష్టంగా ఉండేందుకు కావలసిన అన్ని రకాల చర్యలు, యస్& పిసి ట్రైనింగ్ సెంటర్ అభివృద్ధికి అన్ని రకాల సహాయ సహకారాలు యాజమాన్యం అందిస్తుంది అని, కావున సెక్యూరిటీ సిబ్బంది అందరు మెరుగైన వృత్తి నైపుణ్యంతో, అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ, సింగరేణి ఆస్తులు, స్థలాలను పరిరక్షించాలని, సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. నారాయణరెడ్డి, ట్రైనింగ్ ఇన్ స్పెక్టర్, ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ ల రద్దు కు పోరాటం.. ఐఎన్టీయూసీ

♦ - బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతి కుమార్



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 24 – ప్రజాజ్యోతి:** స్థానిక సత్తుపల్లి పట్టణం సింగరేణిలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్, ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ సూచనలతో సత్తుపల్లి ఐఎన్టీయూసీ యూనియన్ సమావేశం నిర్వహించారు. సత్తుపల్లి బ్రాంచ్ కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ సమావేశంలో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చే ప్రక్రియను ఉపసంహరించుకోవాలని , కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల తో పాటు సింగరేణి ఐక్య కార్మిక సంఘాలు మన సింగరేణి సంస్థను , కార్మికుల హక్కులను కాపాడుకోవడానికి చేసే పోరాటాలు , నిరసన కార్యక్రమాలలో పెద్ద ఎత్తున ఐఎన్టియుసి నాయకులు , కార్యకర్తలు , ఉద్యోగులు పాల్గొని జాక్ కార్యాచరణను విజయవంతం చేయాలని ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ పిలుపునిచ్చారని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్ లుగా మార్చడం వల్ల కార్మికులకు అనేక ఇబ్బందులు కలుగుతాయని ఈ కోడ్ లు అమలులోకి వస్తే కార్మిక సంఘాల ఉనికి కోల్పోవడమే కాక కార్మికులు సమ్మె హక్కు కోల్పోవడం , పని గంటల పెంపు , ఉద్యోగ భద్రత కోల్పోవడం తో పాటు అనేక ప్రయోజనాలను కోల్పోతారని తెలియజేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రతి కార్మికుడు తన హక్కులను కాపాడుకోవడం కోసం తను పనిచేసే సంస్థను కాపాడుకోవడానికి ముందు వరుసలో ఉండి ఐక్య కార్మిక సంఘాల పిలుపుమేరకు ప్రతీ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ బ్రాంచ్ నాయకులు నాగ ప్రకాష్ , రామారావు ( ఫిట్ సెక్రటరీ , జే.వి.ఆర్ ఓసి) , బాలాజీ (ఫిట్ సెక్రటరీ, కిష్టారం ఓసి), పోగుల నాగేశ్వరరావు ( ఫిట్ సెక్రటరీ , జే.వి.ఆర్ సి.హెచ్.పి), అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు , ఆర్గనైజింగ్ సెక్రటరీలు , వివిధ కమిటీ నాయకులు, ముఖ్య నాయకులు , కార్యకర్తలు , ఉద్యోగులు పాల్గొన్నారు.

## దర్శకుడు, గేయ రచయితకు ఘన సన్మానం



**ఇల్లందు, నవంబర్ 24, ప్రజాజ్యోతి:** ఇల్లెందు మండలంలోని కొమరారం గ్రామానికి చెందిన యువకుడు కాంపాటి సత్యం దర్శకత్వం వహించిన రాజు వెడ్స్ రాంబాయి సినిమా ఇల్లెందు పట్టణంలోని సీతారామ టాకీస్ లో విడుదలైంది. సోమవారం ఆ చిత్ర యూనిట్ సభ్యులు ప్రమోషన్ లో భాగంగా ఇల్లందు రావడంతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ చిత్ర దర్శకుడు కాంపాటి సాయిలు, చిత్ర గేయ రచయిత మిట్టపల్లి సురేందర్ లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామంలో జరిగిన ఓ యదార్థ కథను సినిమా తీసి ఘన విజయం సాధించినందుకు చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జబ్బార్, నాయకులు డేరంగుల పోషం, పాలడుగు రాజశేఖర్, చిన్నారి, ఇమ్రాన్, శ్రీకాంత్, ప్రవీణ్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పునీత పేతురు పౌలు దేవాలయ 15వ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహణ




**ఆళ్ళపల్లి.నవంబర్24.ప్రజాజ్యోతి** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ఆర్సియం విచారణలో ఉన్న పునీత పేతురు పౌలు దేవాలయం 15వ వార్షిక ప్రతిష్ట మహోత్సవం నవంబర్ 24న వైభవంగా జరిగింది. దివ్యబలి పూజ మరియు ముఖ్య అతిథులుగా పాలేరు విచారణ గురువు మోస్ట్ రెవరెండ్ కొమ్ము అంతోని, కొత్తగూడెం ఇన్చార్జి డినరీ గురువు జయానంద్ దివ్యబలి పూజను సమర్పించారు. ఈ సందర్భంగా వారు విశ్వాసం, ప్రసంగం, పశ్చాత్తాపం, హృదయ మార్పిడి, మరియు నిన్నువలె నీపొరుగువారిని ప్రేమించడం వంటి క్రైస్తవ ప్రధాన సూక్తులను బోధించారు. ఈ ఉత్సవాన్ని స్థానిక విచారణ గురువు సిద్దెల జేసు ప్రసాద్ మరియు డీకన్ ఉప గురువు అరుణ్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమం లో గురువులు జయరాజు ఓసిడి, కూరపాటి యాకోబు, లూర్దు కిరణ్, అంజులో, డిఎస్ఎస్ సిస్టర్స్, సిస్టర్స్ ప్రశాంత, మహిత, బెర్త, నింపా జ్యోతిర్మయి, యానిమేటర్ ప్రభాకర్, ఉపదేశకులు కీసరి కిరణ్, నాగేశ్వరరావు, అంతోని, సంఘ నాయకులు కామల్ల రాంబాబు, రామ్మూర్తి నాగేశ్వరరావు, బొమ్మెర సత్యం, యూత్ నాయకులు మద్దెల నవీన్, బొబ్బిలి జీవన్, జోజీ తదితరులు పాల్గొన్నారు. శాంతి విద్యనికేతన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

## నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలి

♦ నేడు, రేపు జాతీయ సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు

♦ విలేకరుల సమావేశంలో జాక్ నాయకులు...



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 24 – ప్రజాజ్యోతి:** కార్మికుల హక్కులను కాలరాసేందుకు, భారత పారిశ్రామిక రంగాన్ని దేశ, విదేశీ పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగించేందుకు దోపిడి శక్తులకు ఎదురు లేకుండా చేయడానికే కేంద్ర ప్రభుత్వం నూతనంగా నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చిందని కార్మికసంఘాల నాయకులు మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని శేషగిరిభవన్ లో కార్మిక నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తొలగించి, 4 చట్ట స్వభావం లేని కోడ్లుగా మార్చడాన్ని సింగరేణి కార్మిక సంఘాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయన్నారు. కొత్త చట్టాలను రద్దు చేసి పాత 29 చట్టాలనే కొనసాగించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. గతంలో కేంద్రం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్ లు రద్దు చేయాలని కార్మిక సంఘాలన్నీ ధర్నాలు, ఆందోళనలు, సమ్మెలు చేసినా కేంద్రం పెడచెవిన పెట్టిందని, కార్పొరేట్ కంపెనీలు, పెట్టుబడిదారుల కోసమే కేంద్రం పనిచేస్తుందని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ కోడ్ లను అనుమతించమని వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల పక్ష యూనియన్ ల ఆధ్వర్యంలో ఈ నెల 25న అన్ని గనుల డిపార్టుమెంట్లలో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు, ఈ నెల 26 ఉదయం జిల్లా కలెక్టర్లకు మెమోరండాలు ఇవ్వడం, అదే రోజు సాయంత్రం సింగరేణి వ్యాప్తంగా అన్ని జీ ఎం కార్యాలయాల ముందు ధర్నా చేసే కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ నిరసన కార్యక్రమాలకు అన్ని సంఘాల కార్యకర్తలు, నాయకులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఎఐటియుసి, ఐ ఎన్ టి యూ సీ, సీ ఐ టీ యూ, టీ బీ జీ కే ఎస్ ముఖ్య నాయకులు సారయ్య, వంగ వెంకట్, రమణమూర్తి, వీరస్వామి, గట్టయ్య, ఎర్రగని కృష్ణయ్య, హుమాయూన్, సందబోయిన శ్రీనివాస్, నాయకులు నరసింహ రావు, పీతాంబరం, కాపు కృష్ణ, వెంకటేశ్వర్లు, హుమాయూన్, ఆల్బర్ట్, తుమ్మ శ్రీను, ఐలయ్య, లక్షి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్

**ఇల్లందు, నవంబర్ 24, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జియం వి కృష్ణయ్య ఆదేశాల మేరకు సోమవారం యస్ఓటూ జియం కార్యాలయంలో ఏరియా సింగరేణి ఉద్యోగులకు ఎస్డి క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సిలింగ్ లో ఫ్రెష్ ఎలాట్ మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కొరకు ధరఖాస్తు చేసుకున్న అర్హులైన ఉద్యోగులకు క్వార్టర్లు కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఓటూ జియం రామస్వామి మాట్లాడుతూ హాజరై అర్హత కలిగిన వారికి క్వార్టర్ అలాట్మెంట్ ఉత్తర్వులు జారీ చేయ బడతాయని, క్వార్టర్ ఎలాట్ మెంట్ కమిటి వారు పూర్తి పారదర్శకంగా, ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా నిబంధనలకు అనుగుణంగా క్వార్టర్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీరు ఆర్వీ నరసింహరాజు, డిజియం (పర్సనల్) అజ్మీర తుకారాం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జి. సుధాకర్, క్లర్క్ జి. వీరన్న, ఉద్యోగులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- చర్లలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం
- 35 లక్షల రూపాయలతో డ్వాక్రా సంఘాలకి ప్రభుత్వం బస్సు అందజేత
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట రావు





**చర్ల, నవంబర్ 24: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం రైతు వేదికలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు .డాక్టర్ తెల్లం వెంకటరావు మాట్లాడు తూ ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఇందిరా గాంధీ జయంతి రోజు న మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చ ర్చించడం జరిగిందని దానిలో భాగం గా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని 18 సంవత్సరాలు పైబడి తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క మహిళకి ఇందిరమ్మ చీరలు అందిస్తామని అన్నారు. మహిళా సాధికారత కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని మహిళలను ప్రోత్సహించడంలో పెద్దపీట వేస్తున్నామని దానిలో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించామని ఉచిత కరెంటు ఇస్తున్నామని డ్వాక్రా సంఘా ల ద్వారా మహిళలని ఆర్థికంగా అభివృద్ధిలోకి నడిపించేందుకు కృషి చేస్తున్నామని చర్ల మండలంలో 900 సంఘాలు ఉన్నాయని 9,000 మంది సభ్యులు ఉన్నారని అన్నారు. ఎవరైనా అకస్మాత్తుగా మరణించినట్లయితే 2 లక్షల రూపాయలు భీమా ఇస్తున్నామని అనియాక్సిడెంట్ లో మరణించినట్లయితే 10లక్షల రూపాయలు భీమా అందిస్తున్నామని మరణించిన వారి పైన సంఘంలో ఏవైనా బకాయిలు ఉన్నట్లయితే ఆ బకాయిలను పూర్తిగా మాఫీ చేస్తున్నామని ఆర్థిక భారం సంఘం మీద లేకుండా చూస్తున్నామని అన్నారు. మహిళల పురోగతిని మహిళల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం 30 లక్షల రూపాయలతో డ్వాక్రా సంఘం 5 లక్షల రూపాయలతో డ్వాక్రా సంఘం మహిళలకు బస్సును అందించామని ఆ బస్సు గౌతమి మహిళా మండల సొసైటీ పేరుమీద భద్రాచలం నుంచి కొత్తగూడెం వరకు సర్వీస్ నడుస్తుందని దాని నుండి వచ్చిన వడ్డీ ప్రతినెలా 70000 సంఘం యొక్క అభివృద్ధికి దోహదపడేలాగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు .ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను అన్ని రంగాల్లో రాణించేందుకు మహిళలకు పెద్దపీట వేసేందుకు ఆర్థిక భరోసా అందించేందుకు సున్నా వడ్డీకే రుణా లు కూడా అందిస్తున్నామని ఈ సున్నా వడ్డీ రుణాన్ని కూడా ఉపయోగించుకొని మహిళలు అభివృద్ధిలోకి రాణించాలని మిగిలిన వారు కూడా సంఘా లు ఏర్పరచుకొని ప్రభుత్వం అందిస్తున్న సున్నా వడ్డీ రుణము తీసుకొని ఆర్థికంగా వారు బలోపేతం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్లు పరుచూరి రవికుమార్ ,అచ్యు త శ్రీనివాసరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు ,చర్ల తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, ఏపీఎంఓ లక్ష్మీ దుర్గ, కాంగ్రెస్ నాయకులు చీమలమర్రి మురళి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులకు కత్తెర

- నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి
- కార్మికుల హక్కులు హరించే 4లేబర్ కోడ్ లను రద్దు చేయాలి
- గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ డిమాండ్



**టేకులపల్లి,నవంబర్24,ప్రజాజ్యోతి :** కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4లేబర్ కోడ్ లుగా మారుస్తూ శనివా రం దేశవ్యాప్తంగా అమలులోకి తెస్తున్నట్టు ప్రకటన విడుదల చేయడం పట్ల ఏఐటీయూసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాలు మారుస్తూ కార్మికులకు అందాల్సిన అలవెన్సులు, ప్లేడే లు తదితర సౌకర్యాలను కాలరాస్తు పెట్టుబడి దారులకు అనుకూలంగా 12 గంటలకు పైగా పని చెయ్యాలని కార్మికుల మీద లేబర్ కోడ్ ల రూపం లో పని గంటల ఒత్తిడి తీసుకొస్తున్న బీజేపీ ప్రభుత్వ తీరు పట్ల పిట్ కార్యదర్శి మధు కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా యూనియన్ అగ్ర నాయకత్వ ఆదేశానుసారం కొయగూడెం ఓసిలో సోమవారం కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐటీయూసీ ఇల్లందు ఏరియా బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వేంకటేశ్వర్లు పాల్గొని ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాల క్రితం అనేక పోరాటాలు చేసి సాధించిన హక్కులను కాలరాసేలా బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లు అమలులోకి తెస్తున్నదని దీని వల్ల కార్మికులు అనేక హక్కులు కోల్పోనున్నారని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మార్చి తెస్తున్నందు వల్ల దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోనున్నారని తెలి పారు. సమ్మెహక్కు కోల్పోవడం, గ్రాట్యుటీ చట్టం, బోనస్ చట్టం, అలవెన్సులు వంటి అనేక హక్కులు కోల్పోతారని కాబట్టి నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేసి పాత చట్టాలనే కొనసాగించాలని లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని జేఏసీ గా ఐక్య వేదిక ఏర్పాటు చేసుకుని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు అనంతరం కెఓసి మేనేజర్ పేరాల శ్రీనివాస్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిట్ సహాయ కార్యదర్శి షేక్ సర్వర్, అజ్మీరా కిషోర్, సామల శ్రీనివాస్, కరుణ శంకర్ ,దల్ సింగ్,కనకరాజు,శ్యామ్ సుందర్, హతిరామ్, హీరాలాల్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా గ్రావెల్ మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

- అక్రమంగా గ్రావెల్, ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు
- తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు





**భద్రాచలం, నవంబర్ 24 , ప్రజాజ్యోతి :** అక్రమంగా గ్రావెల్ మట్టి, ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని భద్రాచలం తహసిల్దార్ ధనియాల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పట్టణంలో అనుమతులు లేకుండా గ్రావెల్ మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు భారీగా పెనాల్టీ విధించారు. ఈ సందర్భంగా ధనియాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... భద్రాచలం పట్టణ శివారులో అక్రమంగా గోదావరి గర్భం నుంచి ఇసుకను తోడుతున్నారనే సమాచారంతో ఇటీవల ట్రెంచ్ కొట్టడం జరిగిందని, అదేవిధంగా అనుమతులు లేకుండా గ్రావెల్ మట్టిని రవాణా చేస్తున్నారని సమాచారం అందడంతో ట్రాక్టర్లను అదుపులోకి తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. కావున అక్రమంగా మట్టిని, ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నేడు నల్ల బ్యాడ్జీలతో నిరసన



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 24 – ప్రజాజ్యోతి:** 29 చట్టాలను తొలగించి 4 చట్టాలను చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకిస్తూ రేపు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపాలని ఐఎన్టియుసి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ పిలుపునిచ్చారు. సోమవారం రోజున రుద్రంపూర్ నందు ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశానుసారం ఐఎన్టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. రజాక్ మాట్లాడుతూ... భారత పారిశ్రామిక రంగాన్ని దేశ విదేశీ పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగించేందుకు దోపిడి శక్తులకు ఎదురులేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తొలగించి నాలుగు చట్ట స్వభావం లేని నల్ల చట్టాలను సింగరేణి కార్మిక సంఘాలన్నీ వ్యతిరేకిస్తూ రేపు మైన్స్ ఓపెన్ కాస్ట్ మరియు డిపార్ట్మెంట్లలో పనిచేయుచున్న ప్రతి ఉద్యోగి ఈ కుట్రకు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నీరస తెలపాలని ఐఎన్ టియుసి, ఏఐటీయూసీ, సిఐటియు, టీబీజీకేఎస్, అన్ని సంఘాల నాయకులకు పిలుపునివ్వడం జరిగింది, నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, ఈ యొక్క నిరసన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది, ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ బుటిక రాజేశ్వరరావు, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్కే గౌస్,ట్రెజరర్ భీముడు, సెంట్రల్ కమిటీ మెంబర్స్ బ్రాంచ్ కమిటీ మెంబర్స్ సకినాల సమ్మయ్య,పోశం శ్రీనివాస్,యం.కొమురయ్య, కాసర్ల సమ్మయ్య, ఫిట్ కార్యదర్శిలు చిలక రాజయ్య, గోపు కుమార్ స్వామి, ఎండి సత్తార్ పాష,ఈ.మోహన్ రెడ్డి, కె. నటరాజ్,డి.శంకర్ బాబు, మల్లికార్జున రావు, భాను కమల్, భరత్, నాయకులు రాజశేఖర్, కొలుగురు శ్రీనివాస్, కే.కుమార్, మంగ.రమేష్, కొప్పుల కుమార్, కిరణ్, నాగుల శంకర్, డి శ్రీనివాస్, కుమారస్వామి, రంగినేని వెంకటేశ్వరరావు,గుత్తుల రవి, మిత్రులు శ్రేయోభిలాషులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలి: పీవో రాహుల్

**భద్రాచలం, నవంబర్ 24,ప్రజాజ్యోతి :** ఐటీడీఏ ద్వారా ప్రవేశపెడుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు అందే విధంగా సంబంధిత యూనిట్ అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. సోమవారం నాడు ఐటీడీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో యూనిట్ అధికారుల సమక్షంలో మారుమూల ఆదివాసి ప్రాంతాల నుంచి అర్జీలు సమర్పించడానికి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలను స్వీకరించి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత యూనిట్ అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేయాలని అన్నారు. గిరిజన దర్బార్ లో సమర్పించిన అర్జీలను ప్రత్యేకమైన రిజిస్టర్లో ఆన్లైన్ ద్వారా నమోదు చేసి ,అర్హులైన ప్రతి గిరిజన కుటుంబాలకు విడతల వారీగా సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్,ఆర్ సి ఓ గురుకులం అరుణ కుమారి, ఏ డి ఎం హెచ్ ఓ సైదులు,ఏవో సున్నం రాంబాబు,డి టి ఆర్ ఓ ఎఫ్ ఆర్ లక్ష్మీ నారాయణ,ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్,ఏపీవో పవర్ వేణు, పీ వి టీజీ అధికారి గన్యా,మేనేజర్ ఆదినారాయణ, హెచ్ ఈఓ లింగానాయక్,ఐసిడిఎస్ సూపర్వైజర్ చంద్రకళ మరియు వివిధ శాఖల సిబ్బంది మోహన్, భార్గవి,జోగారావు తదితరులు పాల్గొన్నారు.



## పీఎంఈజిపి, పీఎంఎంవై పథకాల పై అవగాహన



**కొత్తగూడెం, నవంబర్ 24 (ప్రజాజ్యోతి):** పీఎంఈజిపి, పీఎంఎంవై పథకాల పై అవగాహన కార్యక్రమని సోమవారం చుంచుపల్లి వెలుగు ఆఫీసులో నిర్వహించరు.ఈ కార్యక్రమానికి డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ సెంటర్ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి , లీడ్ డిస్ట్రిక్ట మేనేజర్ వి.రాంరెడ్డి , రాంప్ ప్రాజెక్ట ఈడీసీ మేనేజర్ వసంత , అసిస్టెంట్ మేనేజర్ స్వరూప , పిఎం ఎఫ్ఎంఈ డిఆర్పి పృథ్వీమ్ , నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేషన్ ప్రెసిడెంట్ జి.వి.కే.రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈడీసీ మేనేజర్ వసంత పీఎంఈజిపి పథకం గురించి మాట్లాడుతూ.. ఈ పథకాన్ని ఉపయోగించుకుని స్వయం ఉపాధి పొందాలని పాల్గొనేవారికి సూచించారు.సమయం వృథా చేయకుండా మీ వద్ద ఉన్న ఆలోచనతో పథకం ద్వారా స్వయం ఉపాధిగా మార్చుకుని, భవిష్యత్తులో ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ప్రోత్సహించారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

- మొబైల్స్ కి వచ్చే లింకులతో జాగ్రత్తగా ఉండండి.




**జూలూరుపాడు నవంబర్ 24 (ప్రజా జ్యోతి)** సైబర్ నేరాల పట్ల అప్పుడు మొత్తంగా ఉండాలని పోలీసులు సాధన కాలేజీ విద్యార్థులకు సోమవారం ఆహ్వానం కల్పించారు. ముఖ్యంగా మొబైల్ కు కొత్తగా లింకులు పంపడం వాటిని ఓపెన్ చేస్తే మీకు ఎక్కువ ధనం వస్తుంది లేదా లాటరీ కలుస్తుంది మీరు వాహనాలు గెలుచుకున్నారు అని చెబుతుంటారని వాటిని అసలు నమ్మొద్దని తెలియజేస్తున్నారు మొబైల్ కి ఓటీపీలు వస్తే వాటిని చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు 25000 పంపిస్తే మీకు లక్ష రూపాయలు ఇస్తాం అంటూ కేటుగాళ్లు ముందుగా నమ్మిస్తారని ఆ తర్వాత మోసం చేస్తారని వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేస్తున్నారు. బ్యాంకు నుంచి మెసేజ్లు వస్తే నేరుగా బ్యాంక్ అధికారులతో మాట్లాడాలని అన్నారు. ఇటీవల సైబర్ నేరగాళ్లు చాలా మంది అమాయకులు వద్ద నుంచి డబ్బులు లాక్కుంటున్నారని ఈ విషయమై అవగాహన కల్పించుకొని కుటుంబ సభ్యులను గ్రామస్తులను సైతం అప్రమత్తం చేయాలని అన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తయానంద్ పోలీస్ కానిస్టేబుల్ రామకృష్ణ వెంకటేశ్వర్లు ఉపేందర్లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపకం

- ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళలు.



**జూలూరుపాడు నవంబర్ 24 ప్రజా జ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని పడమట నరసాపురం గ్రామంలో సోమవారం ఇందిరమ్మ చీరల పంపిణీ జరిగింది. వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్ ఆదేశాల మేరకు గ్రామంలో మహిళలకు కార్యదర్శి హారిక ఐకెపి ప్రతినిధి ధారావత్ నాగేశ్వరరావు మరియు గ్రామ నాయకులు లేళ్ళ గోపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ చీరలపై సంతృప్తి వ్యక్తం చేశారు గతంలో చీరలు పంపిణీ చేశారే తప్ప వాటి నాణ్యత గురించి పట్టించుకోలేదని ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాత చీరల నాణ్యత పెరిగిందని అందుకు ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి కి మరియు మంత్రులు బట్టి విక్రమార్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తుమ్మల నాగేశ్వరరావు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి లకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇందిరామరాజ్యం వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలు అందరికీ అందుతున్నాయని ఇందిరమ్మ రాజ్యంలో సంతోషంగా ఉన్నామని మహిళలు పేర్కొన్నారు కార్యక్రమంలో గ్రామస్తులు బాధావత్ హరీష్ సంఘం చిన రాజు సంఘం నరసింహారావు రమేష్ లు పాల్గొన్నారు.

# ఏ కష్టం వచ్చినా మీ ఇంటి బిడ్డగా ముందుంటా...

- -ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- -అనసూర్యమ్మ కి నివాళి అర్పించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**పినపాక,నవంబర్ 24(ప్రజాజ్యోతి):** పినపాక మండలం దుగినేపల్లి గ్రామం రెడ్డిగూడెం నివాసి అయిన యగమాటి అనసూర్యమ్మ(86) ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 6 గంటలకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దుగినేపల్లి గ్రామం రెడ్డిగూడెంలో మృతురాలు ఇంటికి వెళ్లి వారి కుమారులైన యగమాటి నారాయణ రెడ్డి, యగమాటి వెంకట్ రెడ్డి,యగమాటి సోమిరెడ్డి లను పరామర్శించారు.ఏ కష్టం వచ్చిన తన దృష్టికి తీసుకురావాలని,అన్నివేళల అండగా ఉంటానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అనంతరం రెడ్డిగూడెం గ్రామస్తులతో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముచ్చటించారు.స్థానికంగా ఉన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. రెడ్డిగూడెం గ్రామానికి మొట్టమొదటిగా మంచినీటి సౌకర్యం కోసం బావిని మంజూరు చేసింది మీరేనని(ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు),అప్పటినుండి ఇప్పటివరకు కూడా రెడ్డిగూడెం గ్రామానికి మంచినీరు సమృద్ధిగా లభిస్తుందని గ్రామస్తులు గతాన్ని గుర్తుచేసుకున్నారు.అర్హులైన లబ్ధిదారులు అందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు గారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు , పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొడిశాల రామనాథం ,కొర్స బాలకృష్ణ ,పేరం వెంకటేశ్వర్లు , దాట్ల రాజేష్ రాజు , సురేష్ రాజు ,దుగినేపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు యగమాటి సాగర్ రెడ్డి,సుంకరి రమణయ్య, కేశర్జున్ రావు, చంద్రమౌలి,పూజారి నవీన్, బరపాటి శివాజీ,బిళ్ళం సాంబశివరావు ,కేత ప్రసాద్,సున్నం హనుమంత రావు గారు, రెడ్డిగూడెం గ్రామస్తులైన నేవూరి యాదిరెడ్డి,అండెం బుచ్చిరెడ్డి,యగమాటి రాజేంద్ర ప్రభాకర్ రెడ్డి, జమ్ముల రవీందర్ రెడ్డి, అండెం విజయకుమార్ రెడ్డి,జమ్ముల రంగారెడ్డి, జమ్ముల సత్తిరెడ్డి, అండెం కృష్టరెడ్డి, నేవూరి కర్ణాకర్ రెడ్డి, రామారావు, అండెం నర్సిరెడ్డి, లింగాల వెంకట్ రెడ్డి, వడ్లకొండ సోమిరెడ్డి, నాగిరెడ్డి, బోరెడ్డి ప్రతాపరెడ్డి, రామూర్తి, సాలయ్య,సోమనర్సయ్య, తదితరులు ఉన్నారు.

## చంద్రుగొండలో నూతన గ్రంథాలయాన్ని నిర్మిస్తాం

- - జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు
- - పాత ప్రభుత్వాసుపత్రి స్థలాన్ని పరిశీలించిన చైర్మన్
- - పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలాన్ని మంజూరు చేయాలని తహశీల్దార్ ను కోరిన చైర్మన్



**చంద్రుగొండ నవంబర్ 24 ప్రజా జ్యోతి** చంద్రుగొండ మండలంలో త్వరలో నూతన గ్రంథాలయాన్ని నిర్మిస్తామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. సోమవారం చంద్రుగొండ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకస్మికంగా సందర్శించి గ్రంథాలయం లోని రిజిస్టర్లను, రికార్డులను, పరిశీలించారు. గ్రంథాలయం పంచాయతీ కార్యాలయం కాంప్లెక్స్ భవనంలో శిథిల వ్యవస్థలో ఉండడాన్ని చూసి ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పాఠకులు, విద్యార్థులు, కూర్చొని చదువుకునేందుకు వీలుగా లేకపోవడాన్ని చూసి వెంటనే చలించిపోయారు. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కు ఫోన్ ద్వారా సంప్రదించి గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని కోరగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గతంలోనే గ్రంథాలయం నిర్మాణానికి పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న పాత ప్రభుత్వాసుపత్రి స్థలాన్ని ఎంపిక చేయడం జరిగిందన్నారు. అధికారులతో మాట్లాడి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. ఇదే విషయంపై చంద్రుగొండ తహశీల్దార్ బి సంధ్యారాణి నీ కలిసి గ్రంథాలయం కోసం స్థలం కేటాయించాలని కోరారు. అలాగే స్థలం దొరికే లోపు ప్రభుత్వ భవనాలు ఏమన్నా ఖాళీగా ఉంటే తమకు కేటాయించాలని కోరారు. వెంటనే స్పందించిన తహశీల్దార్ చైర్మన్ తో కలిసి పలు బిల్డింగ్ లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ మధు బాబు, రెవిన్యూ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మహిళ అభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

- ఆడబిడ్డకు సారేగా చీర పంపిణీ. పాయం వెంకటేశ్వర్లు.







**గుండాల ప్రజా జ్యోతి 24.** మహిళల అభ్యున్నతికై కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని అందులో భాగంగానే నేడు ఆడబిడ్డ సారేగా చీర పంపిణీ చేస్తున్నట్లు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు సోమవారం గుండాల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు ఏర్పాటుచేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు ప్రజా సంక్షేమ అమలు చేస్తూ మహిళలకు ఉచిత బస్సు ఉచిత కరెంటు వడ్డీ లేని రుణాలు ఉచిత గ్యాస్ ఇస్తూనే నేడు ఇందిరమ్మ చీరలు అందిస్తున్నామన్నారు మన రాష్ట్రంలోని నేతన్నలకు పని కల్పిస్తూ ఆడబిడ్డకు బహుమతిగా చీర అందియడం జరుగుతుందన్నారు మహిళ అభ్యున్నతి తో పాటు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను విడుదలవారీగా ఇస్తున్నామని ఇందిరమ్మ గృహాలకు ఐదు లక్షలు లబ్ధిదారులకు ఇచ్చి సొంతింటి కల నెరవేరుస్తున్నామన్నారు విడుదలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని అర్హులైన ప్రతి పేదవాడికి ఐదు సంవత్సరాలలో ఇండ్లు మంజూరు చేస్తామని ఎవరు అధైర్యబడుద్దన్నారు కుల మత భేదం లేకుండా ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని రేకులు పట్టాలు గడ్డి గుడిసెలేని రాష్ట్రంగా చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు అందులో భాగంగానే పినపాక నియోజకవర్గం లో 4500 ఇందిర మైండ్ లో మంజూరయ్యాయని అన్ని వివిధ దశలో నిర్మాణం జరుగుతున్నాయి అన్నారు ప్రజలు మమ్మును దీవించినట్టుగానే ముందు ముందు పార్టీని కాపాడుకోవాలన్నారుఈ సందర్భంగా 1,45,000 సీఎం ఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కాసిం ఎంపీడీవో బాలరాజు ఏపీఎం కరుణాకర్ మండల అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యమాచారి పొంబోయిన ముత్తయ్య ఎస్కే ఖదీర్ చాట్ల పద్మ ఓకే బుచ్చయ్య దారా అశోక్ తదితరులు పాల్గొన్నారు

# ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

- సిపిఐఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఉచిత విద్యుత్ అందించాలి
- సిపిఐ ఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు
- సిపిఐఎం ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ఆందోళన వినతిపత్రం



**భద్రాచలం టౌన్, నవంబర్ 24(ప్రజా జ్యోతి)** భద్రాచలం పట్టణ వ్యాప్తంగా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫారాలను తొలగించాలని శిధిలవస్థకు చేరిపై వంగిపోయి విరిగిపోవటానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని వెంటనే విద్యుత్ శాఖ అధికారులు నివాస ప్రాంతాలలో పర్యటించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ ఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి టెక్నికల్ ఏఈ రోహిణి కి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా గడ్డం స్వామి మాట్లాడుతూ అశోక్ నగర్ కొత్త కాలనీలో కేవలం నాలుగడుగుల ఎత్తులోనే విద్యుత్ ట్రాన్స్ఫారం ఉండటం వల్ల గేదెలు విద్యుత్ ప్రమాదం గురై మరణిస్తున్నాయని చిన్నపిల్లలకు సైతం అందే ఎత్తులో ఉండటంతో స్థానికులు భయ భ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. ట్రాన్స్ఫారాన్ని ఎత్తు పెంచాలని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లి స్పందించడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా కొత్త కాలనీలో 30 సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి విరిగిపోవటానికి సిద్ధంగా ఉన్నావని వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేయాలని డిమాండ్ చేశారు. రాజుపేట కాలనీలో ఇండ్ల మీద నుండి విద్యుత్ లైన్ లు ఉండటం కరెంటు పోల్ ఇరిగిపోవటం వంటి సమస్యలు ప్రజల్ని వేధిస్తున్నాయని వెంటనే విద్యుత్ శాఖ అధికారులు రాజుపేట కాలనీలో పర్యటించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రతి సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యలపై ప్రజా దర్బారు నిర్వహిస్తున్నామని గొప్పలు చెప్పుకునే విద్యుత్ శాఖ అధికారులు 12 గంటల అవుతున్న ఒక అధికారి కూడా అందుబాటులో లేరని ప్రజాపాలనంటే ఇదేనా అని గడ్డం స్వామి ప్రశ్నించారు.

- డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఉచిత విద్యుత్ అందించాలి

**సిపిఐ ఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట రామారావు**

ప్రభుత్వం నిరుపేదలుగా గుర్తించిన వారికి డబుల్ బెడ్ రూములు ఇచ్చి విద్యుత్ బిల్లులు మాత్రం రెండు మూడు వేల రూపాయలు వసూలు చేయటం దుర్మార్గమని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులకు ఉచిత అందించాలని సిపిఐఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రంశెట్టి వెంకట రామారావు డిమాండ్ చేశారు. కరకట్ట పరిసర ప్రాంతాలలో పూరి గుడిసెల్లో జీవిస్తున్న నిరుపేదలకు ముంపు పేరుతో తమ ఇళ్లను తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించిన ప్రభుత్వ అధికారులు విద్యుత్ బిల్లులు మాత్రం వేల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. విద్యుత్ బిల్లులు సైతం లబ్ధిదారుల పేరు మీద రాకుండా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి పేరు మీద రావటం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వెంటనే లబ్ధిదారుల పేరు మీద విద్యుత్ బిల్లులు ఇవ్వాలని ప్రతి ఒక్కరికి ఉచిత విద్యుత్ అందించాలని కోరారు. భూపతి రావు కాలనీలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న నిరుపేద మహిళ ఇంటికి విద్యుత్ లైన్లు అడ్డుగా ఉంటే తొలగించమని ఎన్నిసార్లు అభ్యర్థించిన అధికారి స్పందించడం లేదని ఆ కారణంతో పేదింటి మహిళ ఇందిరమ్మ ఇల్లు పూర్తి చేసుకోకుండా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. వెంటనే ఇండ్ల మీద నుంచి ఉన్న విద్యుత్తు లైను తొలగించాలని లేని పక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని గొప్పలు చెప్పుకునే విద్యుత్ శాఖ అధికారులు చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించాలని వెంకట్రామారావు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారెల్లి సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి జీవన జ్యోతి కనక శ్రీ శాఖ కార్యదర్శి గోవర్ధన ఝూన్సీ చెన్నారు వెంకటరమణ నాయకులు హైమావతి లంబురమణ కాకా రమణ తదితరులు పాల్గొన్నారు.

## ముత్తంగి అలంకారంలో భద్రాద్రి రామయ్య



**భద్రాచలం, నవంబర్ 24,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం స్వామి వారు ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకర బెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం:పాయం వెంకటేశ్వర్లు

- పి వై ఎల్ రాష్ట్ర కార్యదర్శి బికోజి కాంగ్రెసులో చేరిక.





**గుండాల ప్రజా జ్యోతి 24.** ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటూ కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు సోమవారం మండల కేంద్రంలోని గుండాల తండాలో జరిగిన చేరికల సభలో ఆయన మాట్లాడారు మాస్ లైన్ అనుబంధ పి వై ఎల్ రాష్ట్ర కార్యదర్శి వాంకుడోత్ బికోజి. (అజయ్). ఆధ్వర్యంలో పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు బానోత్ నరేందర్. మాజీ ఉపసర్పంచ్ ధారావత్ హాలియా తోపాటు మరికొన్నికుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు బి కోజి ఆధ్వర్యంలో వివిధ పార్టీలలో పనిచేసిన అనేకమందికాంగ్రెస్ పార్టీలో చేరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాలతో పాటు అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారని చేరిన ప్రతి ఒక్కరిని కాపాడుకుంటూ పార్టీ అభివృద్ధికి కృషి కృషి చేస్తామన్నారు పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుంటే దాన్ని చూసి వందలాదిగా పాటలు చేరుతున్నారని చేరిన ప్రతి ఒక్కరూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై పనిచేసి తమ అభ్యర్థులను గెలిపించు కోవడానికి కృషి చేయాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొడెం ముత్యమాచారి ఎస్కే ఖదీర్ ముత్తయ్య చాట్ల పద్మ ఓకే బుచ్చయ్య చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అంతరాయం



**చర్ల, నవంబర్ 24: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని చర్ల సబ్ స్టేషన్ లో ఇప్పటివరకు ఒక 5 ఏం వి ఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్ఫార్మర్ ఉన్నది కావున ప్రస్తుతం పెరుగుతున్న సర్వీసులు అదనపు లోడులకు అనుగుణంగా – ఓల్టేజీ సమస్యలను అధిగమించుటకు చర్ల సబ్ స్టేషన్ లో మరొక 5ఎం వి ఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయుటకు 26/11/2025 బుధవారం నుండి – 30/11/2025, ఆదివారం వరకు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు చర్ల సబ్ స్టేషన్ లో గల అన్ని ఫీడర్లకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది అని రైతులకు వ్యవసాయ మోటార్ కరెంటు సాయంత్రం నాలుగు గంటల నుండి కలిపి ఇవ్వబడుతుంది అని కావున చర్ల సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు సహకరించవలసిందిగా కోరుచున్నాము అని చర్ల విద్యుత్ అధికారి ఏఈ డి .వెంకటేశ్వర్లు తెలియచేసారు .

## దళారీల బారిన పడకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి:కొత్వాల



**పాల్వంచ(టౌన్),నవంబర్ 24(ప్రజా జ్యోతి):** రైతులు దళారీలకు గురి కాకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే తమ ఉత్పత్తిని విక్రయించి మద్దతు ధరను అందుకోవాలని పాల్వంచ సొసైటీ చైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు సూచించారు.సోమవారం పాల్వంచ మున్సిపాలిటీ పరిధి శివారు గ్రామమైన పేటచెరువులో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొత్వాల ప్రారంభించారు. మాట్లాడుతూ ఆయన తెలిపారు:ఏ గ్రేడు ధాన్యానికి క్వింటాకు ₹2,389సాధారణ ధాన్యానికి క్వింటాకు ₹2,369 మద్దతు ధరగా ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు.అంతేకాక తెలంగాణ ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాకు ₹500 బోనస్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేస్తూ, రైతులు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్,డైరెక్టర్లు కనగాల నారాయణ రావు,జరబన సీతారాం బాబు,సీఈఓ ప్రసాద్,రైతులు కొండం వెంకన్న,లోగాని రామారావు,వజీర్, వాడే రాములు తదితరులు పాల్గొన్నారు.

## పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఇందిరమ్మ చీరలు పంపిణీ





**ఆళ్ళపల్లి. నవంబర్24. ప్రజాజ్యోతి** ఆళ్ళపల్లి మండలంలో కాంగ్రెస్ నాయకులు పాయం వెంకటేశ్వర్లు అర్హులైన మహిళలకు 'ఇంద్రమ్మ చీరలు' పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులకు ఇళ్లు కూడా అందిస్తున్నామని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.మరియు సీఎంఆర్ఎఫ్ ఫండ్ 90 వేల రూపాయల చెక్కులు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీవో ఫణీంద్ర, ఎంఈఓ శాంతయ్య, సీడీపీఓ తార,ఏ ఓ అనిల్ కుమార్, మెడికల్ ఆఫీసర్ రేవంత్, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ సతీష్ రెడ్డి, పిఆర్ ఏఈ వినీత్, హౌసింగ్ ఏఈ వహీద్, గ్రిడ్ ఏఈ సాయి కిరణ్, ఐసీడీస్ సూపర్వైజర్ విజయ కుమారి.స్థానిక నాయకులలో ఎంఎంఎస్ అధ్యక్షురాలు పావని, మండల అధ్యక్షులు రామనరసయ్య, వాసం శ్రీకాంత్, మాజీ ఎంపీపీ పడిగా సమ్మయ్య, మాజీ సర్పంచ్ సమ్మక్క, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.